సాక్షి మహబూబ్‌నగర్

మంగళవారం । 5 । మార్చి । 2024



కాలుష్య పరిశ్రమ వద్దు

అమరరాజ బ్యాటరీ కంపెనీని తరలించాలని స్థానికులు ఆందోళన చేపట్టారు.

వివరాలు 8లో ▸



పులకించిన శైవక్షేత్రం

అలంపూర్ ఆలయాల్లో శివరాత్రి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
38.8 /18.3

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బీసీ స్టడీ సర్కిల్‌లో ఉచిత శిక్షణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహబూబ్‌నగర్, నారాయణపేట, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గలవారు మంగళవారం నుంచి గురువారం వరకు మెట్టుగడ్డ స్టడీ సర్కిల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ఆర్టీసీ దసరా లక్కీడ్రాకు విశేష స్పందన



స్టేషన్ మహబూబ్‌నగర్: దసరా పండుగను పురస్కరించుకొని గతేడాది అక్టోబర్‌లో ఆర్టీసీ సంస్థ లక్కీడ్రా నిర్వహించగా ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించినట్లు రీజినల్ మేనేజర్ వి.శ్రీదేవి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో సోమవారం రీజియన్ పరిధిలోని ఆయా బస్టాండ్లలో ఏర్పాటు చేసిన మహిళ, పురుష ప్రయాణికుల వేర్వేరు టికెట్ బాక్స్‌లను ఓపెన్ చేసి లక్కీ డ్రా తీసి విజేతల పేర్లను ఆర్ఎం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆర్ఎం మాట్లాడుతూ గెలుపొందిన ఐదు మంది మహిళలు, ఐదు మంది పురుషులకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. మహిళల్లో శారద, శశికళ, భాగ్యలక్ష్మి, కావేరి, రబియ, పురుషుల్లో నీలయ్య, వెంకటస్వామి, వినోద్‌గౌడ్, నవీన్‌రెడ్డి, జి.కల్యాణ్ విజేతలుగా నిలిచారు. త్వరలో హైదరాబాద్‌లో ఈ కార్యక్రమం ఉంటుందని, గెలుపొందిన వారికి సమాచారం అందిస్తామని చెప్పారు. ప్రజలు ఆర్టీసీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజినల్ మేనేజర్లు శ్యామల (మెయింటెనెన్స్), లక్ష్మిధర్మ (ఆపరేషన్), డిపో మేనేజర్ సుజాత, అసిస్టెంట్ మేనేజర్ రాంజీ, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా మహిళా క్రీడలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ 'జీడీసీ ఉమెన్ కప్' క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. సోమవారం స్థానిక మెయిన్ స్టేడియంలో విద్యార్థినులకు వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచాలనే ఉద్దేశంతో కళాశాల, జిల్లా, క్లస్టర్ స్థాయిలో క్రీడా పోటీలు నిర్వహిస్తామన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, క్రీడాస్ఫూర్తి చాటాలని కోరారు. ఓడిపోయామనే నిరుత్సాహంతో ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకుండా గెలిచే వరకు ప్రయత్నిస్తూనే ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అధ్యాపకులు యాదయ్య, కురుమూర్తి, రాజవర్ధన్‌రెడ్డి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుకు..



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): బీసీ రాజ్యాధికారమే ధ్యేయంగా ముందుకు సాగుదామని ఓబీసీ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కొట్ల కిషోర్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలను చైతన్యం చేసేందుకు తమ ఫోరం పనిచేస్తుందన్నారు. బీసీలను ఏకం చేసేందుకు బుధవారం స్థానిక టీఎన్‌జీఓ భవనంలో ఉదయం 11 గంటలకు వివిధ బీసీ, కుల సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు చెప్పారు. సమావేశంలో చర్చించి సమష్టిగా ఓ నిర్ణయం తీసుకోనున్నట్లు వివరించారు. సమావేశంలో ఓబీసీ డెవలప్‌మెంట్ ఫోరం యువత అధ్యక్షుడు శివప్రసాద్‌యాదవ్, నాయకులు సాయిపద్మశాంతి, విజయ్, రహీం, బాబు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అన్నివర్గాలకు న్యాయం

- వివరాలు 8లో..

తాగునీటి ఎద్దడిపై నజర్



హన్వాడ మండలం మాధారంలో మోటారును బోరుబావి నుంచి తీస్తున్న సిబ్బంది

గ్రామాల్లో నీటి సమస్యపై ముందస్తు ప్రణాళిక

- ముమ్మరంగా తాగునీటి వనరుల పునరుద్ధరణ
- గ్రామ పంచాయతీ, సీడీఎఫ్ నిధులతో పనుల నిర్వహణ
- రూ.6.76 కోట్లతో వేసవి యాక్షన్ ప్లాన్ మరూ

జిల్లాలో గ్రామ పంచాయతీలు 441	హ్యాబిటేషన్ గ్రామాలు 886
పనిచేస్తున్న బోరుబావులు 1,705	మరమ్మతుకు ప్రతిపాదించిన నిధులు (రూ.లలో)
పని చేయనివి 716	2,43,36,500
అందుబాటులో మోటార్ పంపులు 1,256	మరమ్మతుకు ప్రతిపాదించిన నిధులు (రూ.లలో)
పని చేయనివి 978	2,64,76,952
పైప్‌లైన్ మరమ్మతు చేయాల్సింది (మీటర్లు) 33,353	మరమ్మతుకు అవసరమైన నిధులు (రూ.లలో) 1,72,98,602

మహబూబ్‌నగర్ న్యూటౌన్: జిల్లాలో గతేడాది వర్షపాతం తక్కువగా నమోదు కావడంతో వేసవికాలం ప్రారంభంలోనే తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. భూగర్భజలాలు తగ్గడం, ఎండలు తీవ్రమవుతుండటంతో పల్లెల్లో తాగునీటి వనరులు కునారిల్లుతున్నాయి. ఈ క్రమంలోనే గ్రామాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రభుత్వం ముందస్తు ప్రణాళిక సిద్ధం చేసింది. గ్రామ పంచాయతీ నిధులు, నియోజకవర్గ అభివృద్ధి నిధులతో మరమ్మతు పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో తాగునీటి వనరుల పునరుద్ధరణపై అధికార యంత్రాంగం దృష్టిసారించింది. అయితే.. నాలుగైదు సంవత్సరాలుగా మిషన్ భగీరథ పథకం ద్వారా అన్ని కుటుంబాలకు నల్లా నీళ్లు అందిస్తున్నామని చెబుతూ గ్రామ పంచాయతీల్లోని తాగునీటి వనరులను నిర్లక్ష్యం చేశారు. బోరు, బావులు, పైప్‌లైన్లు, మోటార్ల కనీస నిర్వహణ, మరమ్మతు మరిచారు. దీంతో మూలనపడిన వాటిని పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో అధికార యంత్రాంగం వేసవిని దృష్టిలో ఉంచుకొని అప్రమత్తమైంది. తాగునీటి సరఫరా బాధ్యతలు సైతం గ్రామ పంచాయతీలకు అప్పగించింది.

యుద్ధ ప్రాతిపదికన పనులు

జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్టమైన చర్యలకు ఉపక్రమించింది. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపటి తాగునీటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటోంది. మిషన్ భగీరథ పథకం ద్వారా నీరు వస్తుందని గ్రామాల్లోని తాగునీటి వనరులను నిర్లక్ష్యం చేసిన దృష్ట్యా కొన్ని బోరు, బావులు పూడుకుపోయాయి. నిర్వహణ లేకపోవడంతో హ్యాండ్ పంప్ సెట్లు, బోరు, మోటార్లకు బిగించి ఉన్న లోపలి ఇనుప పైపులు తుప్పుబట్టి పోయాయి. అలాంటి వాటిని బయటికి తీసి కొత్తవి బిగించాల్సి ఉంది. పూడుకుపోయిన బోరు బావులను మరోసారి ఫ్లషింగ్ చేయాలి. వేసవిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా పైప్‌లైన్‌ల లీకేజీల మరమ్మతు చేపట్టనున్నారు. ఇళ్లకు సరఫరా అవుతున్న నీటి పైపులైన్లకు ఇబ్బందులు ఉన్నచోట మరమ్మతు చేయాల్సి ఉందని గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం, పంచాయతీరాజ్ అధికారులు పేర్కొంటున్నారు. అవసరమైన చోట ప్రైవేట్ బోర్లను అద్దెకు తీసుకొని గ్రామాల్లో ప్రజలకు తాగునీటిని అందించాలని నిర్ణయించారు.

ప్రణాళికతో ముందుకు..

జిల్లాలో ఇప్పటి వరకు తాగునీటికి ఎక్కడా ఇబ్బందులు రాలేదు. అయితే ఈసారి వేసవి ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ముందస్తు ప్రణాళికతో ముందుకెళ్తున్నాం. ఎక్కడైనా మిషన్ భగీరథ నీళ్లు సరిపోకపోతే బోర్లు, హ్యాండ్ పంపులు మరమ్మతు చేయించడం, గేట్‌వాల్వ్‌లు, పైప్‌లైన్ రిపేర్లు చేయించే చర్యలు చేపడుతున్నాం. వేసవిలో అనుకోని ఇబ్బందులు ఎదురైతే ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నాం. – వెంకటేశ్వర్లు, డీపీఓ

ప్రభుత్వానికి ప్రతిపాదనలు..

పంచాయతీ అధికారులు కొన్ని సంవత్సరాలుగా మూలనపడిన బోర్లు, మోటార్లు, పైప్‌లైన్ మరమ్మతుపై దృష్టిసారించారు. జిల్లాలోని 441 గ్రామ పంచాయతీలు, 886 హ్యాబిటేషన్ గ్రామాల్లో తక్షణ మరమ్మతుల కోసం రూ.6.76 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి పనులను ప్రతిపాదించారు. ఆయా నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో చేపట్టాల్సిన పనులపై ఇప్పటికే సంబంధిత ఎమ్మెల్యేలతో చర్చించి నిర్ణయం తీసుకున్న అధికార యంత్రాంగం తాగునీటి ఎద్దడి రాకుండా పటిష్టమైన చర్యలకు ఉపక్రమించారు. పంచాయతీరాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా విభాగాల సమన్వయంతో తయారు చేసిన అంచనాలను జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి కలెక్టర్‌కు చేరగా వాటిని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే గ్రామాల్లో పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నారు. అత్యవసరమైన చోట ఉన్నతాధికారుల సూచన మేరకు ఇప్పటికే మరమ్మతు పనులు చేపడుతున్నారు.



వేసవిలో తాగునీటి ఇబ్బందులపై వీసీ నిర్వహిస్తున్న కలెక్టర్ రవినాయక్ (ఫైల్)

ప్రాణాలు తీసిన నిద్రమత్తు

చెట్టుకు ఢీకొన్న కారు.. ఐదుగురు దుర్మరణం



కొత్తకోట సమీపంలో జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన కారు

- ఘటనా ప్రాంతంలో ఇది మూడో ప్రమాదం
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వనపర్తి ఎస్పీ రక్షితా కె.మూర్తి



సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న వనపర్తి ఎస్పీ రక్షితా కె.మూర్తి

వనపర్తి: పెళ్లి ముహూర్తం పెట్టుకోవడానికి పిల్లలు, పెద్దలందరితో ఇంటి నుంచి బయల్దేరిన ఓ కుటుంబం ఘోర రోడ్డు ప్రమాదానికి గురైన సంఘటన సోమవారం తెల్లవారుజామున వనపర్తి జిల్లా కొత్తకోట శివారులో చోటుచేసుకుంది. అతివేగం, కునికి పాటు ఈ ఘోర ప్రమాదానికి కారణమైనట్లు పోలీసులు పేర్కొన్నారు. కారు డ్రైవింగ్ చేసిన పెళ్లి కుమారుడు ఖాజాకుత్బుద్దీన్ మాట్లాడుతూ బళ్లారిలోని బసవన్నకుంట నుంచి బయల్దేరిన తాము కర్నూలు పట్టణం దాటిన తర్వాత అర్ధరాత్రి సుమారు ఒంటిగంట ప్రాంతంలో ఒక హోటల్ వద్ద కుటుంబ సభ్యులంతా భోజనం చేశామని చెప్పారు. అప్పుడే రైలులో వెళ్తున్న వారు కాల్ చేసి ఎక్కడి వరకు వచ్చారు.. నిద్ర వస్తే.. హైవేపై ఉన్న పెట్రోల్ పంపులో ఆగి కొద్దిసేపు నిద్రించి తెల్లవారుజామున బయల్దేరాలని సూచన చేశారు. కానీ, ఆలస్యం అవుతుందని భావించి భోజనం తర్వాత మళ్లీ బయల్దేరామని, కునికిపాటు రావడంతో కారు పక్కకు వెళ్లినట్లు గుర్తించలేదని, ఒక్కసారిగా భారీ శబ్దంతో కారు చెట్టును ఢీకొట్టడం, కారులోని అందరం చెల్లాచెదురుగా పడిపోవడంతో మేలుకువ వచ్చిందని వాపోయాడు.

మృతుల్లో 95 ఏళ్ల వృద్ధురాలు.. ఏడు నెలల పసికందు

రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఐదుగురిలో 95 ఏళ్ల సలీమాబీ, 7 నెలల పసికందు వాసీఫారిఫత్ అనే చిన్నారితోపాటు 39 ఏళ్ల అబ్దుల్ రహమన్, రెండేళ్ల రుమానా, నాలుగేళ్ల రోషిణి ఉన్నారు. మరో ఆరేళ్ల చిన్నారి సుమేర ఎలాంటి గాయాలు కాకుండా బయటపడటం గమనార్హం.

ఇది మూడో ఘటన

2009లో అనంతపురం జిల్లా మడకశిర ఎమ్మెల్యే మిత్రులు ప్రమాణ స్వీకారం చూడాలనే ఉద్దేశంతో మారుతీ వ్యాన్‌లో హైదరాబాద్‌కు వెళ్తుండగా.. తెల్లవారుజామున వాహనం అదుపు తప్పడంతో చోటుచేసుకున్న సంఘటనలో నలుగురు మృతి చెందారు.

- 2020లో మహారాష్ట్ర నుంచి శ్రీశైలం వెళ్తుండగా క్రూజర్ వాహనం డ్రైవర్ నిర్లక్ష్యం కారణం కల్వర్టును ఢీకొట్టడంతో ప్రమాదంతో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఐదుగురు మృతిచెందారు. సంఘటనా స్థలంలో నలుగురు మృతి చెందగా.. మరో వ్యక్తి చికిత్స పొందుతూ ఆస్పత్రిలో మృత్యువాతపడ్డారు.
- తాజాగా ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకున్న ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం పాలయ్యారు.

జాగ్రత్తలు పాటించాలి

అర్ధరాత్రి ప్రయాణాల విషయంలో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని వనపర్తి ఎస్పీ రక్షితా కె.మూర్తి అన్నారు. రాత్రి సమయంలో డ్రైవింగ్ చేసే అనుభవం లేనివారు వాహనాలు నడపడం శ్రేయస్కరం కాదన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా డ్రైవర్లకు అవగాహన కల్పిస్తామన్నారు. సంఘటన స్థలాన్ని పరిశీలించగా.. డ్రైవింగ్ చేస్తున్న వ్యక్తి నిద్రించడం, అతివేగంగా కారు నడపడమే కారణమని ప్రాథమిక అంచనాకు వచ్చినట్లు చెప్పారు.

ప్రారంభమైన ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

మహబూబ్‌నగర్ న్యూటౌన్: మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఉపఎన్నికలకు సంబంధించిన నోటిఫికేషన్ జారీ కావడంతో నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కలెక్టరేట్‌లో రూం నం.11లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కౌంటర్‌లో కలెక్టర్, ఎన్నికల అధికారి రవినాయక్ నామినేషన్లను స్వీకరించనున్నారు. అయితే మొదటిరోజు సోమవారం ఒక్క నామినేషన్ కూడా నమోదు కాలేదు. మార్చి 11 వరకు నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ సాగనుంది. 12న నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణకు 14 తుది గడువు. ఈ నెల 28న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్, ఏప్రిల్ 2న ఓట్ల లెక్కింపు చేపడుతారు.

పాలమూరు అభివృద్ధికి సీఎం కృతనిశ్చయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉమ్మడి పాలమూరు జిల్లాను విద్య, వైద్య, ఇతర అన్నిరంగాల్లో అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలిపేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృతనిశ్చయంతో ఉన్నారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పాత ఉమ్మడి జిల్లాను ఎడ్యుకేషనల్ హబ్‌గా మార్చడానికి ఇటీవలే కొడంగల్‌లో సీఎం మెడికల్, ఇంజినీరింగ్, నర్సింగ్ కళాశాలలకు శంకుస్థాపన చేశారన్నారు. పాలమూరు యూనివర్సిటీకి రూసా కింద రూ.100 కోట్లు నిధులు రావడంలో ముఖ్యమంత్రి కార్యాలయం కృషి ఎంతో ఉందన్నారు. పశ్చిమ మహబూబ్‌నగర్‌ను సస్యశ్యామలం చేయడానికి నారాయణపేట–కొడంగల్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. గత ప్రభుత్వం పాలమూరు– రంగారెడ్డి ఎత్తిపోతలపై పూర్తి నిర్లక్ష్యం వహించిందని, జూరాల నుంచి కాకుండా శ్రీశైలం బ్యాక్‌వాటర్ ద్వారా ప్రాజెక్టు అంటూ రూ.27 వేల కోట్లను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. గత ప్రభుత్వం అమర్‌రాజ ఫ్యాక్టరీకి అనుమతులు ఇచ్చిందని, ఆ మేరకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు ఉద్యోగాలు వచ్చేలా చూస్తామన్నారు. కాలుష్యాన్ని కంపెనీ ఆవరణ దాటకుండా తగిన రీతిలో చర్యలు తీసుకుంటామని చెప్పారు. మహబూబ్‌నగర్‌ను దేశ విద్యాపటంలో చోటు లభించేలా నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్) ఏర్పాటుపై సీఎంకు విన్నవిస్తే సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారి రేవంత్‌రెడ్డి బుధవారం పాలమూరుకు వస్తున్నారని, ఆయనకు జిల్లా ప్రజలు ఘన స్వాగతం పలకాలని కోరారు. సమావేశంలో నాయకులు వినోద్‌కుమార్, బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, రాములుయాదవ్, అవేజ్, వెంకటలక్ష్మి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



మన్యంకొండలో ముగిసిన పద్యనాటకోత్సవాలు

స్టేషన్ మహబూబ్‌నగర్: మన్యంకొండ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీమిత్ర కళానాట్య మండలి ఆధ్వర్యంలో చేపట్టిన పద్య నాటకోత్సవాలు సోమవారం రాత్రి ముగిశాయి. ఉత్సవాల చివరిరోజు మౌనిక నాట్యం అకాడమీ ఆధ్వర్యంలో విద్యార్థులు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడితోపాటు ఇతర సంప్రదాయ నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదే విధంగా జానకిరామాచారి బృందం అన్నమాచార్య సంకీర్తనలు ఆలపించారు. సీతారామాంజనేయస్వామి భజన మండలి (బొక్కలోనిపల్లి), శ్రీహనుమాన్ భజన మండలి (ఏనుగొండ)లు భక్తిశ్రద్ధలతో భజనలు ఆలపించారు. ఈ సందర్భంగా శ్రీమిత్ర కళానాట్య మండలి కార్యదర్శి నారాయణ మాట్లాడుతూ గత కొన్నేళ్ల నుంచి మన్యంకొండ బ్రహ్మోత్సవాల సందర్భంగా నాటక ప్రదర్శనలు ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో చంద్రమౌళి, నర్సింహులు, లక్ష్మయ్య, శంకర్‌రావు, భాస్కరాచారి, దత్తు పాల్గొన్నారు.

పోలీస్ శాఖ గౌరవం పెంచేలా పనిచేయాలి



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా ప్రజలకు న్యాయమైన, మెరుగైన సేవలు అందించి పోలీస్ శాఖ గౌరవం మరింత పెంచే విధంగా కృషి చేయాలని ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల నుంచి ఎస్పీ ఫిర్యాదులు స్వీకరించారు. బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకున్న తర్వాత వారి సమస్యలపై నేరుగా సంబంధిత పోలీస్ అధికారులతో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. సామాన్య ప్రజలకు పోలీస్ అండగా ఉండాలని, వారితో స్నేహభావంగా నడుచుకోవాలన్నారు. జిల్లాలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపట్ల కఠినంగా ఉంటూ చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. పోలీస్ సహాయం అవసరమైన బాధితులు నిర్భయంగా స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు.

స్వయం ఉపాధి కోర్సులకు దరఖాస్తు చేసుకోండి

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో ఈనెల 18 నుంచి 13వ బ్యాచ్ శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు దరఖాస్తు తేదీని ఈనెల 17 వరకు పొడిగించినట్లు తెలిపారు. ఆసక్తిగల వారు పాత డీఈఓ కార్యాలయంలోని వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. దరఖాస్తు వెంట విద్యార్హత, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, కులం సర్టిఫికెట్లు జతచేయాలని కోరారు. పదో తరగతి పాస్ లేదా ఫెయిల్ అయిన యువతకు మూడు నెలల పాటు ఫ్యాషన్ డిజైనింగ్, గార్మెంట్ తయారీ, బ్యూటీషియన్, ఎంఎస్ ఆఫీస్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషన్, మొబైల్ సర్వీసింగ్, సీసీ కెమెరాలు ఇన్‌స్టాల్, సర్వీసింగ్‌పై శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 7వ తరగతి పాసైన వారికి జర్దోసి, మగ్గం, ఎలక్ట్రీషియన్‌పై శిక్షణ ఉంటుందని తెలిపారు. శిక్షణ అనంతరం పరీక్ష నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి హైదరాబాద్ సెట్విన్ వారిచే సర్టిఫికెట్ ఇస్తారని, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మిగతా వివరాలకు సెంటర్ ఇన్‌చార్జి ఎస్.విజయ్‌కుమార్ (94415 65895)ను సంప్రదించాలని కోరారు.

కార్యకర్తలే బీజేపీకి బలం బలగం



మహబూబ్‌నగర్‌లో మాట్లాడుతున్న డీకే అరుణ

పాలమూరు/ దేవరకద్ర: కార్యకర్తలే బీజేపీకి బలం బలగం అని, ఐకమత్యంతో పనిచేస్తే విజయం ఖాయమని పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ అన్నారు. రాష్ట్రంలోనే మహబూబ్‌నగర్ ఎంపీ సీటు గెలుపు చాలా ప్రతిష్టాత్మకమని, దీనిని కచ్చితంగా గెలవాలన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా బీజేపీ కార్యాలయంతోపాటు దేవరకద్రలో సోమవారం అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్నివర్గాల గురించి ఆలోచించే మోదీని మరోసారి ప్రధాని చేసే బాధ్యత మనమందరం కలిసి తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు, అయోధ్య రామమందిర నిర్మాణం, రామరాజ్య స్థాపనకు ప్రధాని మోదీ చేస్తున్న కృషి బూత్ స్థాయిలోని ప్రజల్లోకి కార్యకర్తలే ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ఆయా సమావేశాల్లో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారు శ్రుతి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఏపీ మిథున్‌రెడ్డి, కొండా ప్రశాంత్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ కుర్వ రమేష్, బుడ్డన్న, రాజేందర్‌రెడ్డి, అంజయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా కోర్ కమిటీ సమావేశంలో రాష్ట్ర కోశాధికారి శాంతకుమార్ పాల్గొని పార్లమెంట్ ఎన్నికలపై చర్చించారు.

ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టి



అధికారులతో సమీక్షిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఆస్తి పన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిసారించాలని మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం రాత్రి కార్యాలయంలోని తన చాంబర్‌లో రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగియడానికి కేవలం 26 రోజులు మాత్రమే ఉందన్నారు. ఇప్పటి వరకు కేవలం 35 శాతమే వసూలు అయిందని, గడువులోగా లక్ష్యం చేరుకోవాలన్నారు. పేరుకుపోయిన బకాయిల వడ్డీపై 90 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మినహాయింపును పట్టణ ప్రజలకు వివరంగా తెలియజేయాలన్నారు. ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి ఆస్తి పన్ను, నల్లా బిల్లులు బకాయి పడకుండా వసూలు చేయాలని సూచించారు. సమావేశంలో ఏఎంసీ పవన్‌కుమార్, ఆర్ఓ మహమ్మద్ ఖాజా, ఆర్ఐలు నర్సింహులు, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం


శ్రావణి(ఫైల్)

కోస్గి: ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితులు కథనం మేరకు గండేడ్ మండలం గోవింద్‌నాయక్ తాండకు చెందిన రాజునాయక్ తన భార్య శ్రావణి(25)తో కోస్గిలోని వికాస్‌నగర్‌లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి ఏడు నెలల బాబు ఉన్నాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇంట్లోనే శ్రావణి ఉరేసుకుంది. గమనించిన కొందరు సమాచారం ఇవ్వడంతో ఆమెను వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతిరాలి తల్లి ప్రభుత్వ ఉద్యోగి కాగా, వారి కుటుంబం సైతం కోస్గిలోనే స్థిర పడింది. కాగా వివాహిత ఆత్మహత్యకు సంబంధించిన కారణాలు తెలియాల్సి ఉందని, ప్రస్తుతానికి మృతురాలి తల్లి సరోజ ఫిర్యాదు మేరకు ఆత్మహత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి..

బిజినేపల్లి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తిమ్మాజిపేట మండలం అమ్మపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. అమ్మపల్లికి చెందిన నడిమింటి బాలయ్య (50) కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన అతడు.. ఇంట్లోనే పురుగులమందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య నారమ్మ, ముగ్గురు సంతానం ఉన్నారు.

వలస కార్మికుడి మృతి

రాజోళి: మండలంలోని బుమరుసు గ్రామ శివారులో చేపట్టిన భారత్‌మాల రోడ్డు పనులు చేసేందుకు వచ్చిన ఓ కార్మికుడు సోమవారం ప్రమాదవశాత్తు మృతిచెందాడు. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రంలోని దేవసూరుకు చెందిన బాబు (45) కూలీ పనుల నిమిత్తం బుమరసు గ్రామానికి వచ్చాడు. ఆదివారం భారత్‌మాల రోడ్డు పనులు చేపడుతున్న క్రమంలో మిగతా కూలీలకు భోజనం తయారుచేస్తానని సమీపంలోని రూం వద్దకు వెళ్లాడు. కొంతసేపు తర్వాత భోజనం కోసం అక్కడికి మిగతా వారు వెళ్లగా.. అప్పటికే బాబు కిందపడిపోయి ఉన్నాడు. చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కాంట్రాక్టర్ రామకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.

మృతదేహం లభ్యం

దామరగిద్ద: మండల కేంద్రం కొత్త చెరువులో చేపల వేటకు వెళ్లి గల్లంతైన నాగప్ప(45) మృతదేహం లభ్యమైంది. పోలీసులు ఆదివారం రాత్రి గజఈతగాళ్ల సాయంతో వెలికి తీశారు. సోమవారం పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

రెండు ఇళ్లలో చోరీ

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండలం గొరిటలోని రెండు ఇళ్లలో దుండగులు చోరీకి యత్నించారు. సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు బాధిత కుటుంబ యాజమానులు తిరుపతమ్మ, రాములు తెలిపారు. రెండు కుటుంబాల్లో 15తులాల వరకు బంగారు, ఇతర ఆభరణాలు, రూ.8 లక్షల వరకు నగదు అపహరణకు గురైనట్లు తెలియజేశారు. పోలీసులకు ఫిర్యాదు అందడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపడుతున్నారు.

కేసు నమోదు..

గోపాల్‌పేట: రేవల్లి మండలంలోని శానాయిపల్లిలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. రేవల్లి ఏఎస్‌ఐ మల్లయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శానాయిపల్లికి చెందిన అంకూరి నాగయ్య భార్య దేవమ్మలకు ఇద్దరు కుమారులు. వారు హైదరాబాద్‌లో పనులు చేసుకుని జీవనం కొనసాగిస్తున్నారు. భార్యాభర్తలు గ్రామంలో పనులు చేసుకుని బతుకుతున్నారు. ఇటీవల నాగర్‌కర్నూల్ జిల్లా బొందలపల్లిలో నాగయ్య బంధువు మృతిచెందారు. ఆదివారం పదిరోజులు(దినవారాల) కార్యక్రమానికి భార్యాభర్తలు కలిసి వెళ్లారు. సోమవారం ఉదయం తొమ్మిది గంటల ప్రాంతంలో ఇంటివద్దకు వచ్చి చూసేసరికి తలుపులు తెరుచుకుని కనిపించాయి. ఇంట్లోకి వెళ్లి చూడగా.. ఇంట్లో దాచి ఉంచిన నగదు రూ.90 వేలు కనిపించలేదు. దీంతో వెంటనే వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి క్లూస్‌టీం వారిని పిలిపించి వేలిముద్రలు సేకరించామని ఏఎస్‌ఐ మల్లయ్య తెలియజేశారు.

పులకించిన శైవక్షేత్రం


పుట్టమట్టిని తీసుకొస్తున్న ఆలయ చైర్మన్, పాలకమండలి

- ప్రారంభమైన మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు
- తొలిరోజు యాగశాల ప్రవేశం, మృత్ సంగ్రహణం, అగ్ని ప్రతిష్ఠ


యాగశాలలో పూజలు చేస్తున్న భక్తులు

జోగుళాంబ శక్తిపీఠం: శ్రీశైల మహాక్షేత్రానికి పశ్చిమ ద్వార క్షేత్రమైన అలంపూర్ బాలబ్రహ్మేశ్వర ఆలయాలు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలతో పులకరించిపోయాయి. సోమవారం ప్రారంభమైన కార్యక్రమాలను విద్యావాచస్పతి బ్రహ్మశ్రీ అవ్వారి శ్రీనివాస్‌శాస్త్రీ ఆధ్వర్యంలో 35 మంది రుత్వికులు, వేదపండితులు, ఆలయ అర్చకులు చేపట్టారు. గణపతి పూజలు, పుణ్యాహవచన, రుత్విక్ వరుణ, వేదఘోష, మంగళవాయిద్యాల మధ్య యాగశాల ప్రవేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాగశాల సమీపంలోని బ్రహ్మేశ్వర ఉద్యానవనంలో పుట్టమట్టికి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ చిన్న కృష్ణయ్య, పాలకమండలి సభ్యులు శిరస్సున పుట్టమట్టిని తీసుకుని ఛత్ర చామరాల మధ్య వాటిని యాగశాలలోకి తీసుకొచ్చి వాటితో అంకురార్పణ చేశారు. యాగశాలలోని నాలుగు దిక్కులలో ఆదిత్యాది నవగ్రహాలు, చతుషష్టియోగిని దేవత, క్షేత్రపాలక దేవతా మండపం, వాస్తు మండపాలను ఆవాహన చేశారు. ఆలయ ఈఓ పురేందర్ కుమార్, ఆలయ పాలక మండలి సభ్యుల చేత యాగశాలలోని శోడష స్తంభాలకు ఒక్కొక్కరి చేత ప్రత్యేక పూజలు చేయించి వాటికి కంకణధారణ చేశారు. ఈ సందర్భంగా వేదపండితుల చేత మహా సంకల్ప పఠనం చతుర్వేద పారాయణాలు వల్లె వేశారు.

మహా సంప్రోక్షణ ఎందుకంటే?

అష్టబంధన ద్రవ్యకాటిన్యం పుష్కరకాలమే ఉంటుందని, ఆ తర్వాత దేవతామూర్తుల విగ్రహాలకు దివ్యశక్తిని తేజస్సును మళ్లీ ఆవాహనం చేయాలని, అలాగే సువర్ణాన్ని తిరిగి తేజోవంతం చేయాలని ఆగమవచనం. దీని ప్రకారం 12 ఏళ్లకు ఓ సారి గర్భాలయంలో మరమ్మతులు, పీఠానికి బంధనం వంటి కార్యక్రమాలు చేస్తారు. స్వామిబింభమును ఆనంద నిలయాన్ని తేజోవంతం చేయడం మహా సంప్రోక్షణ ఆగమోక్తంగా పంచాహ్నిక దీక్షతో చేయడం జరుగుతుందని ఆచార్యులు తెలిపారు.

12 ఏళ్లకు ఒకసారి మహాకుంభాభిషేకం

అనంతమైన దైవశక్తిని మళ్లీ ప్రతిష్ఠించి ఆలయ శక్తిని మరింత పెంపొందించి మహా మహిమాన్విత కార్యక్రమం ఇది. పంచభూతాత్మికమైన కుంభంలో పంచముఖుడైన పరమేశ్వరుడిని నిలిపి సకల కళలను తత్వాలను నింపి నిరంతర జప, ధ్యాన హోమాదులు జరిపి ఆలయవిమాన శిఖరంపై అభిషేకించే గొప్పకార్యం. ఆలయ విమానంకు గోపురానికి గర్భగుడిలోని విగ్రహానికి కుంభాభిషేకం జరుపుతారు. విశేషంగా జరిపే ఈ మహత్కార్యాన్ని మహాకుంభభిషేకం అని, అష్టబంధనం ద్రవ్యాలను సమర్పించి చేసే కార్యక్రమం. దీనిని అష్టబంధన మహాకుంభాభిషేకం అని అంటారు.

కాలుష్య కారక పరిశ్రమ వద్దు


దివిటిపల్లిలోని బ్యాటరీ కంపెనీ ఎదుట ఆందోళనకారులకు సర్దిచెబుతున్న రూరల్ పోలీసులు

- 3 గంటల పాటు అమరరాజా కంపెనీ ఎదుట ధర్నా
- పనులను ఆపివేయించిన 4 గ్రామాల ప్రజలు
- నిర్వాహకులతో వాగ్వాదం.. కొద్దిసేపు ఉద్రిక్తత
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన పరిస్థితి


దివిటిపల్లిలోని కంపెనీ ఎదుట బైఠాయించిన మహిళలు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: దివిటిపల్లిలోని ఐటీ టవర్‌లో ఏర్పాటు చేస్తున్న లిథియం అయాన్ గిగా (అమరరాజ బ్యాటరీ కంపెనీ) ని వేరే చోటకు తరలించాలంటూ నాలుగు గ్రామాలకు చెందిన సుమారు 150 మంది ప్రజలు సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా కంపెనీ నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. కొనసాగుతున్న పనులను ఆపి వేయించడమేగాక ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మహబూబ్‌నగర్ పార్లమెంట్ కో–కన్వీనర్ తిరుపతిరెడ్డి మాట్లాడుతూ జనావాసాలకు సమీపంలో ఈ పరిశ్రమను ఏర్పాటు చేయడం వల్ల కాలుష్య సమస్య తలెత్తి దివిటిపల్లి, ఎదిర, అంబటిపల్లి, సిద్దాయపల్లికి చెందిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. ముఖ్యంగా జల, వాయు కాలుష్యంతో పంట పొలాలు దెబ్బతింటాయన్నారు. చుట్టుపక్కల 20 కి.మీ. పరిధిలోని ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడతారన్నారు. ఇదే విషయాన్ని గత శాసనసభ ఎన్నికల సమయంలోనూ ప్రస్తుత ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. అయితే ప్రస్తుతం ఆయన ఈ విషయం తమ పరిధిలో లేదని దాటవేస్తున్నారని ఆరోపించారు. ఈ పరిశ్రమకు బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో 376 ఎకరాలు కేటాయించారని పేర్కొన్నారు. గతంలో ప్రజాభిప్రాయ సేకరణ సమయంలోనూ ఇక్కడ ఏర్పాటు చేయొద్దని ఆయా గ్రామస్తులు చెప్పినా ఎలాంటి ప్రయోజనం దక్కలేదన్నారు. అప్పటి ప్రభుత్వం అనుమతి ఇవ్వడంతో పనులు కొనసాగుతున్నాయన్నారు. కాగా, విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ రూరల్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలోనే ఆయనను అదుపులోకి తీసుకుంటుండగా ఆందోళనకారులు అడ్డుకోవడంతో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరకు కలెక్టర్ జి.రవినాయక్‌తో మాట్లాడేందుకు అవకాశం కల్పిస్తామని ఆందోళనకారులకు సర్దిచెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. అనంతరం కలెక్టరేట్‌కు ఆందోళనకారులు తమ వాహనాల్లో తరలివెళ్లారు. అయితే కలెక్టర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్ల స్వీకరణలో నిమగ్నమయ్యారని, మంగళవారం సాయంత్రం 4.30 గంటలకు కలవవచ్చని ఏఓ శంకర్ చెప్పడంతో వెనుదిరిగారు.

కాంగ్రెస్ హయాంలో అన్నివర్గాలకు న్యాయం


న్యాయయాత్ర చేపడుతున్న చల్లా వంశీచంద్‌రెడ్డి, పాల్గొన్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- బీఆర్‌ఎస్, బీజేపీ పాలనలో ఒరిగిందేమిలేదు
- సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్/ హన్వాడ: సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు. వంశీచంద్‌రెడ్డి సోమవారం మహబూబ్‌నగర్ మండలంలో అలివేలు మంగతాయారు దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి న్యాయయాత్ర చేపట్టారు. కోటకదిర, పోతన్‌పల్లి, మాచన్‌పల్లి, రాంచంద్రపూర్, కోడూర్ క్రాస్ రోడ్, బొక్కలోనిపల్లిలో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఈ ప్రాంతానికి అన్యాయం జరిగిందన్నారు. డబుల్ బెడ్రూంలు అంటూ ప్రభుత్వం మోసం చేసిందని, ఈ నెల 11న సీఎం రేవంత్‌రెడ్డి ఇల్లు లేని పేద కుటుంబానికి రూ.5 లక్షలతో ఇల్లు కట్టుకునే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రైతులందరికీ రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేసే బాధ్యత తీసుకుంటామని సీఎం చెప్పినట్లు గుర్తుచేశారు. రూ.2 వేల పింఛన్ త్వరలో రూ.4 వేలు వస్తుందని, అర్హులైన వారికి నూతన రేషన్‌కార్డులు ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం యువతను మోసం చేసిందని ఆరోపించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో మన భవిష్యత్ కోసం కాంగ్రెస్‌కు ఓట్లు వేసి రాహుల్‌గాంధీని ప్రధానిని చేద్దామని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్ అంటేనే సంక్షేమం

పోతన్‌పల్లి, మాచన్‌పల్లిలో జరిగిన న్యాయయాత్రలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ అంటేనే సంక్షేమమని అన్నారు. ఇచ్చిన మాటను నిలబెట్టుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే రెండు గ్యారంటీ పథకాలను అమలు చేసినట్లు తెలిపారు. పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం 25 వేల ఉద్యోగాలు ఇస్తే, ఈ మూడు నెలల్లోనే 35 వేల ఉద్యోగాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలో పోతన్‌పల్లి, మాచన్‌పల్లిలో పలువురు యువకులు కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, వినోద్‌కుమార్, ఎన్పీ వెంకటేష్, చంద్రకుమార్‌గౌడ్, ఎం.సురేందర్‌రెడ్డి, మల్లు నర్సింహరెడ్డి, మణెమ్మ పాల్గొన్నారు. న్యాయయాత్ర సోమవారం రాత్రి హన్వాడకు చేరుకోగా.. అక్కడ ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి మాట్లాడారు.

దరఖాస్తుల స్వీకరణ

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: మహాత్మ జ్యోతి బాపూలే బీసీ ఓవర్సీస్ విద్యానిధి పథకం 2022– 23 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ అధికారి ఇందిర సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆన్‌లైన్‌లో మంగళవారం సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు.

తగ్గుతున్న నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో నీటిమట్టం క్రమంగా తగ్గుతోంది. సోమవారం 1,015 అడుగులకు నీటిమట్టం చేరింది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో 13 మందికి జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీల్లో మద్యం తాగి వాహనాలు నడిపిన వాహనదారులను ట్రాఫిక్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడిన మొత్తం 13 మంది వాహనదారులను సోమవారం ఎక్సైజ్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి హరికుమార్ ఒక్కో వాహనదారుడికి రూ.2 వేల చొప్పున 13మందికి కలిపి రూ.26 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ శ్రీనివాస్ మాట్లాడారు. మద్యం తాగి ఎవరూ వాహనాలు నడపరాదన్నారు. మద్యం తాగడంతో రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని, దీంతో రెండు కుటుంబాలు ఇబ్బంది పడుతాయని తెలియజేశారు.

ఆముదాలు @ రూ.5,429

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం జరిగిన టెండర్లలో ఆముదాలు క్వింటాకు రూ.5,429 దర నమోదైంది. సీజన్ లేకపోవడంతో మార్కెట్‌కు చాలా తక్కువ మొత్తంలో ఆముదాలు అమ్మకానికి వచ్చాయి.

భూగర్భ కేంద్రంలో భద్రత వారోత్సవాలు


మాట్లాడుతున్న సీఈ సూర్యనారాయణరావు

దోమలపెంట: 'భద్రత నా బాధ్యత' అని భూగర్భ కేంద్రంలో ఇంజినీర్లు, ఉద్యోగులు, కార్మికులతో కేంద్రం సీఈ సూర్యనారాయణరావు సోమవారం ప్రతిజ్ఞ చేయించారు. 53వ జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకుని కేంద్రంలో జెండా ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ మేనేజర్ డీఈ శ్రీకుమార్‌గౌడ్ కేంద్రంలో భద్రతకు చేపట్టిన వివరాలను వివరించారు. తొలి రోజు భద్రతకు సంబంధించిన బ్యానర్లను ప్రదర్శించి తదుపరి కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో భద్రతపై ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, ఇంకా చేపట్టాల్సిన చర్యలపై సీఈ సమీక్షించారు. ఎస్‌ఈ (ఓఅండ్‌ఎం) ఆదినారాయణ, ఎస్‌ఈ (సివిల్) రవీంద్రకుమార్, ఫైర్ ఆఫీసర్ మల్లికార్జున, ఎఫ్‌పీఎఫ్ ఆర్‌ఐ సూర్యరావు, కేంద్రంలో పనిచేసే డీఈలు, ఏఈలు, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

రసవత్తరంగా జాతీయ స్థాయి కుస్తీ పోటీలు


కుస్తీ పోటీలకు హాజరైన వివిధ రాష్ట్రాల క్రీడాకారులు



కుస్తీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

అయిజ: పట్టణంలో తిక్క వీరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కుస్తీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. బీఆర్‌ఎస్ నాయకుడు సంకాపురం రాముడు పోటీలను ప్రారంభించగా.. వివిధ రాష్ట్రాలకు చెందిన 33 మంది క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తలపడ్డారు. కుస్తీ పోటీలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు.

విజేతలు వీరే..

కుస్తీ పోటీల విజేతలకు ఎస్‌ఐ విజయభాస్కర్ చేతులమీదుగా బహుమతులను ప్రదానం చేశారు. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లా చండచండ్ గ్రామానికి చెందిన రాంచందర్ ప్రథమ బహుమతి రూ.40వేలు సాధించారు. హైదరాబాద్‌కు చెందిన రుద్రేష్‌యాదవ్‌కు ద్వితీయ బహుమతి రూ.25వేలు, హర్యానాకు చెందిన బవికాస్‌కు తృతీయ బహుమతి రూ.15వేలు, సంగారెడ్డికి చెందిన చరణ్‌కు నాలుగో బహుమతి రూ.7వేలు, మెదక్‌కు చెందిన రాంశెట్టికి ఐదో బహుమతి రూ.3వేలను అందజేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం


గంట్రావ్‌పల్లిలో తెగిపడిన విద్యుత్ వైర్లు

పెద్దకొత్తపల్లి: మండలంలో గంట్రావ్‌పల్లిలో ఎస్సీ, బీసీ కాలనీలో సోమవారం 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడటంతో షార్ట్‌సర్క్యూట్ సంభవించింది. దీంతో ఇళ్లలో ఉన్న టీవీలు, ఫ్రిజ్‌లు, ఫ్యాన్లు, లైట్లు, పాఠశాల, రైతు వేదికలో ఉన్న వస్తువులు కాలిపోయాయి. ఎలక్ట్రానిక్ వస్తువులు ఒక్కసారిగా పెద్దశబ్దం రావడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. ఇళ్ల నుంచి నుంచి పరుగులు తీశారు. వస్తువులు దగ్ధమవడంతో ఇళ్లనుంచి పొగలు కమ్ముకున్నాయి. దాదాపు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి చెన్నరావుపల్లి సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది.

ప్రభుత్వ భూములు అమ్మేసుకున్నారు

- గత పాలకులపై ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ధ్వజం


బాలానగర్‌లో చెరువుల ఆక్రమణకు సంబంధించి ఫొటోలు చూపుతున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

జడ్చర్ల: బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వ భూములను మాయం చేసి సొమ్ముచేసుకున్నారని, సంబంధిత తహసీల్దార్ కార్యాలయాల్లో ఆయా భూములకు సంబంధించి రికార్డులను కూడా మాయం చేసి ఆధారాలు లేకుండా చేశారని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత పాలనలో సాగిన అన్యాయాలు, అక్రమాలను ఆయన వివరించారు. ఉదండాపూర్ రిజర్వాయర్‌లో సేకరించిన భూముల్లో ప్రభుత్వ భూములు కూడా అధికారుల సహకారంతో కొల్లగొట్టి సొమ్ము చేసుకుని పంచేసుకున్నారని వాపోయారు. త్వరలోనే ఆయా వివరాలు బయటకు వస్తాయని తెలిపారు. చెరువులు సైతం ఆక్రమించి నిబంధనలు అతిక్రమించారని అన్నారు. బాలానగర్‌లో రెండు చెరువుల మధ్య ఉన్న లోతట్టు ప్రాంతాన్ని పది అడుగుల మేర మట్టితో చదును చేసి వెంచర్లు చేశారని, నీటి మళ్లింపునకు కాల్వలు నిర్మించి అక్రమాలకు పాల్పడ్డారని దీనిపై ఆధారాలు ఉన్నాయని ఫొటోలు చూపించారు. గతంలోనే తాము సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. దీంతో రూ.5 కోట్లు జరిమానాగా అధికారులు విధించారని గుర్తుచేశారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా పోలేపల్లి గ్రామ శివారులో సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూముల లెక్కలు తేలుస్తామని స్పష్టం చేశారు.

ఇసుక రాకుండా అడ్డుకునేందుకు..

జడ్చర్లకు ఇసుక రాకుండా అడ్డుకునేందుకు బీఆర్‌ఎస్ నేతలు కుట్రలకు తెరలేపారని అన్నారు. గతంలో అడ్డదిడ్డంగా ఇసుక దోపిడీకి పాల్పడిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. తాము నిబంధనల ప్రకారం అయ్యవారిపల్లి వద్ద ఉన్న ఇసుక డంపులను చట్టపరంగా వేలం వేసి మెడికల్ కళాశాల, తదితర సీసీ రోడ్డు పనులకు వినియోగిస్తున్నామని చెప్పారు.

రోడ్ల అభివృద్ధికి కృషి..

నియోజకవర్గంలోని అన్ని గ్రామాలకు సంబంధించి బీటీ రోడ్లను ఏర్పాటు చేసి, విస్తరించడం వంటి పనులకు నిధులు మంజూరు చేశామన్నారు. ఇప్పటికే పలు రోడ్లను డబుల్ రోడ్లుగా మార్చేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. జడ్చర్ల, బాలానగర్ ప్రభుత్వ అతిథి గృహాల అభివృద్ధికి రూ.1.50 కోట్లు ప్రతిపాదించామన్నారు. జడ్చర్లకు బైపాస్ రోడ్డు నిర్మించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ నిత్యానందం, మాజీ మార్కెట్ చైర్మన్ జనార్దన్‌రెడ్డి, ట్రాన్స్‌కో డీఈఈ క్రిష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.